మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపండి

తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, నవంబర్ 21: రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, మహాసభ 10వ ఆవిర్భావ వేడుకలు గురువారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ, తరతరాలుగా మత్స్య వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న లక్షలాది మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించి ఆర్థికంగా తోడ్పాటునందించాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసి, చెరువులు కుంటలను మత్స్యశాఖకు బదలాయించి, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు పొందడం జరిగిందన్నారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మహాసభ నిరంతరం ఎంతో కృషి చేస్తుందన్నారు. జీవో నం.6తో మత్స్యకారులకు ప్రాతినిధ్యం కల్పించి ముదిరాజ్‌లకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహాసభను ఏర్పాటు చేసిన నాటికి 2000 సంఘాలు ఉంటే ఇప్పుడు సుమారు 6000 సంఘాలకు పైగా పెంచి నాలుగు లక్షల సభ్యత్వాలు చేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని ముదిరాజ్ కులసంఘాలను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మార్చేంత వరకు ఐక్యతతో ముదిరాజ్‌లు ముందుకు సాగి పోరాటాలు కొనసాగించాలని పిలుపు నిచ్చారు.

టీ - హబ్‌లో ఎనిమిది మాట్రిక్ డిజైన్ కాన్‌క్లేవ్స్

కొండాపూర్, నవంబర్ 21: నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో ఎనిమిది మాట్రిక్ డిజైన్ కాన్‌క్లేవ్స్‌ను మార్స్ మీడియా, ఇవాల్ స్కిల్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ-వర్క్స్ సీఈఓ తనికెళ్ల జోగీందర్, టీ -హబ్ సీఈఓ రాహుల్ పైత్, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హాలు ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఫ్యాషన్, జువెల్లరీ, ఇంటిరీయర్స్, సస్టైనేబులిటీ, గేమింగ్, ఏఆర్/వీఆర్, ఉత్పత్తులు, హెల్త్‌కేర్, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ వంటి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమల దిగ్గజాలు పాల్గొని తమ సలహాలు, సూచనలను పంచుకున్నారు. అనంతరం, సృజనాత్మకమైన డిజైన్లను రూపొందించిన పలువురిని అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎనిమిది మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాజ్ సావర్కర్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరో జేఏసీ ఏర్పాటు

చిక్కడపల్లి, నవంబర్ 21: వివాహాల విషయంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న వివిధ మ్యారేజ్ బ్యూరో సంఘాలను కలుపుకుని భారత దేశ స్థాయిలో ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరో జేఏసీని నిర్మించినట్టు కమిటీ చైర్మన్ బీఎం అర్జున్ రావు అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి మ్యారేజ్ బ్యూరో సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జున్ రావు మాట్లాడుతూ మ్యారేజ్ బ్యూరో సంఘాల పరంగా ఐక్యత పాటించడం జరుగుతుందని తెలిపారు. తమకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ హాజరై జేఏసీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సూర్యచంద్ర రావు, పట్టాభి రామయ్య, సాయి ప్రసాద్, నారాయణ స్వామి, పురుషోత్తం, తారక రామారావు, మోటుపల్లి చంటి, బొడ్డు ప్రసాద్, నరేంద్ర పురం, అయ్యగారి సాయిరాం, వైకుంఠ రావు, హకీమ్, వేణు, మాగంటి సురేశ్, లీలావతి, శ్రీనివాస్, చరణ్, కొండస్వామి పాల్గొన్నారు.

అంబర్‌పేట ఎస్టీపీలో 300 మందికి ఆరోగ్య పరీక్షలు

సిటీబ్యూరో, నవంబరు 21(నమస్తే తెలంగాణ): జల మండలి ఎస్టీపీల్లో పనిచేసే కార్మికులకు అంబర్‌పేట ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శ్రీ రామానుజ, జనహిత సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ గురువారం ప్రారంభించారు. కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎండీ తెలిపారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్టుల్ని ఆయన అభినందించారు. దాదాపు 300 మంది కార్మికులకు ఈ ఆరోగ్య శిబిరంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం, ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ, ఈడీలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీ రామానుజ సేవా ట్రస్ట్ వైర్మన్ డాక్టర్ జీవీ ధనుంజయ్, జీఎంలు సుబ్రమణ్యం, సంతోష్ కుమార్, డీజీఎం రాజ్ కుమార్, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా టాప్ 20లో పతంజలి ఆయుర్వేద సంస్థకు చోటు

సిటీబ్యూరో, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా 552 ఆయుర్వేద సంస్థలలో టాప్-20లో పతంజలి ఆయుర్వేద సంస్థ చోటు దక్కించుకుందని పతంజలి యోగాపీఠ్ సెక్రటరీ ఆచార్య బాలకృష్ణ తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని మొత్తం 20 కాలేజీలలో 'ఏ' గ్రేడ్ రేటింగ్ కలిగిన ఏకైక కాలేజీ పతంజలి ఆయుర్వేద కాలేజీ అని ఆయన పేర్కొన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ విడుదల చేసిన నేషనల్ రేటింగ్స్‌లో హరిద్వార్‌లోని పతంజలి భారతీయ ఆయుర్విజ్ఞాన్ ఏవమ్ అనుసంధాన్ సంస్థాన్ టాప్-20లో చోటు దక్కించుకుని ఏ గ్రేడ్ రేటింగ్‌లో ఉందని ఆయన తెలిపారు.

విధులలో పట్టుదలతో పని చేయండి

రాష్ట్ర ఇంటలీజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

మేడ్చల్ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌లో దీక్షాంత్ పరేడ్

మేడ్చల్ రూరల్, నవంబర్ 21: శిక్షణ పూర్తి చేసుకుని సమాజ సేవ కోసం పోలీస్ ఉద్యోగంలో చేరబోతున్న సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లు విధి నిర్వహణలో తుది వరకు పట్టుదలతో పని చేయాలని రాష్ట్ర ఇంటలీజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లాలోని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయలో గల మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలలో తొమ్మిది నెలలు శిక్షణ పూర్తి చేసిన 526 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుల్ (ఎస్‌సీటీపీసీ)లు గురువారం కేంద్రంలో దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటలీజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. శిక్షణకు పూర్వం శిలలుగా ఉన్న మీరు నేడు శిల్పాలుగా మారి సమాజ సేవ కోసం అడుగు పెడుతుండటం ఆనందంగా ఉందన్నారు. పోలీస్ ఉద్యోగులుగా జాతీయ జాతీయ జెండా సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి భారత రాజ్యాంగానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మీరు ప్రకటించుకున్నారని గుర్తు చేశారు. జాతీయ జెండా సాక్షిగా చేసిన ప్రమాణాన్ని ఉద్యోగ నిర్వహణలో తుది వరకు గుర్తు పెట్టుకుంటారని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మీరు శారీరక సామర్థ్యం, మానసిక పట్టుదల నైపుణ్యంతో ఈ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమ అనంతరం, ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, మేడ్చల్ సీఐ సత్యనారాయణ, శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

526 మంది శిక్షణ పూర్తి

కండ్లకోయలోని మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో వివిధ జిల్లాలకు చెందిన 526 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2023-24 సంవత్సరంలో తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న వీరిలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 235 మంది, మెదక్ జిల్లా చెందిన 52, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 47, నల్గొండ జిల్లాకు చెందిన 192 మంది ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే చేయండి

ఈసీఐఎల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన

ర్యాలీకి హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

కాప్రా, నవంబర్ 21: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల స్కాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఈసీఐఎల్ చౌరస్తాలో విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన కొనసాగింది. ఈ సారి నల్ల బ్యాడ్జీలు ధరించిన విద్యార్థులు, పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ చౌరస్తాలో మూకుమ్మడిగా నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది పరిసర కాలేజీల విద్యార్థులు ఈ ధర్నా కార్యక్రమానికి తరలివచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య విద్యార్థుల ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నాలుగు రోజులుగా నగరం మార్మోగేలా విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్కాలర్ షిప్పులు రాక, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులు లేక విద్యార్థులు అష్టకష్టాలు పడ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించని పక్షంలో ఈ ఉద్యమం ఇదే రీతిన కొనసాగతుందని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యలు తీర్చడం లేదని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ విమర్శించారు. ర్యాలీకి అనుమతి లేదని కుషాయిగూడ పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. అక్కడ నుంచి అందరినీ వెళ్లిపోవాలని కోరారు. ఆర్.కృష్ణయ్య, విద్యార్థి నేతలతో కుషాయిగూడ సీఐ అంజయ్య, సెక్టార్ ఎస్ఐ వెంకన్న తదితరులు మాట్లాడటంతో అక్కడ నుంచి విద్యార్థులు నిష్క్రమించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ, జిల్లాపల్లి అంజి, భూపేశ్ సాగర్, పి.సతీశ్, పృథ్వీగౌడ్, రవి కుమార్ యాదవ్, నిఖిల్, అరవింద్, చంద్రశేఖర్, అనిల్, అర్జున్, శివ పాల్గొన్నారు.

అమ్మ భాష కండ్ల లాంటింది..ఆంగ్లం కండ్లద్దాల్లాంటిది

భారతీయ సనాతం ధర్మం ఎంతో గొప్పది

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

శిల్పారామంలో లోక్ మంథన్ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): పాశ్చత్య సంస్కృతి మోజులో పడి మన భాష, వేష ధారణను మరిచిపోయామని, కానీ, ప్రతి ఒక్కరు తిరిగి భారతీయ మూలాల్లోకి వెళ్లాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. భారతీయ సనాతన ధర్మం చాలా గొప్పదని, జంతు జాలాన్ని కూడా బతికించుకునే సంస్కృతి మనదని నొక్కి చెప్పారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో నాలుగు రోజుల పాటు జరగనున్న 'లోక్ మంథన్-24 ఎగ్జిబిషన్'ను గురువారం ఆయన ప్రారంభించారు. బ్రిటిష్ వాళ్లు, పాశ్చాత్యులు మన సంపదతో పాటు మనస్సులనూ దోచుకెళ్లారన్నారు. మనం సాహిత్యాన్ని, సంగీతాన్ని, మన మాటలు, వాద్యాలను మరిచిపోయి ఇంగ్లిష్ వైపు వెళ్లిపోయామని విశ్లేషించారు. తిరిగి మూలాల్లోకి వెళ్లి మాతృభాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. "మాతృభాష కండ్ల లాంటిది.. ఆంగ్ల భాష కండ్లద్దాల్లాంటిది" అని అభివర్ణించారు. ఏ భాషకు వ్యతిరేకం కాదని, కానీ, తల్లి భాషను కాపాడుకోవాలని ఉద్బోధించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణతో పాటు తాను కూడా మాతృభాషలోనే చదువుకొని ఉన్నతులుగా ఎదిగామని గుర్తు చేశారు. కాన్వెంట్ ముఖం చూడని నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారన్నారు. తాను ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినా వేషధారణ మార్చుకోలేదని చెప్పారు. మన సంస్కృతి గొప్పదనం, హిందువునని గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. భారతీయ సంగీత, సాహిత్యాన్ని విదేశాల్లో ఉన్న మన దేశస్తులు ఆదరిస్తుంటే మనం మాత్రం పాశ్చాత్య మోజులో పడటం బాధాకరమని అన్నారు. ప్రకృతితో స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే మనందరి జీవితాలు బాగుంటాయని చెప్పారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవాటు చేయాలని, యోగా సాధన చేయించాలని సూచించారు. శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉంటారనే విషయం మరిచిపోవద్దన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారతీయ కుటుంబ వ్యవస్థను కాపాడుకొని భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాట శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ.. కళా ఖండాన్ని మించిన గొప్ప కళ

ఇండియన్ ఫోటోగ్రఫీ ఫెస్టివల్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

కొండాపూర్, నవంబర్ 21: ఫొటోగ్రఫీ ఒక ఆర్ట్, పెయింటింగ్ కంటే క్లిష్టమైనదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇండియన్ ఫొటో ఫెస్టివల్ -2024, 10వ ఎడిషన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా గురువారం హాజరై తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో అద్భుతమైన చిత్రాలను తమ కెమెరాలతో బంధించి, ఎంతో మందికి మధుర జ్ఞాపకాలను అందించగల గొప్ప ఆర్ట్ ఫొటోగ్రఫీ అన్నారు. గత జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలంగా ఉంచగల గొప్ప శక్తి ఫొటోగ్రఫీ సొంతమన్నారు. హైదరాబాద్ నగరం ఎంతో అద్భుతంగా ఉంటుందని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ఆకట్టుకుంటాయన్నారు. ఫొటో ఫెస్టివల్‌లో 45 దేశాలకు చెందిన 550 మంది ఫొటోగ్రాఫర్లు తాము తీసిన 1500ల ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. ఇండియా, యూఎస్ఏ, యూకే, సౌత్ ఆఫ్రికా, ఉజ్బెకిస్థాన్, వెనుజుల, టర్కీ, స్పెయిన్, స్వీడన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, సింగపూర్, సెర్బియా, రష్యా, కెనడా, ది ఫిలిప్పీన్స్, పెరు, న్యూజిలాండ్, ది నెదర్లాండ్స్, నేపాల్, బంగ్లాదేశ్, జపాన్, ఇజ్రాయిల్, ఇటలీ, ఇండోనేషియా దేశాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారని, ఈ ఫెస్టివల్ ఈ నెల 21 నుంచి జనవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సిల్ట్ ఛాంబర్ లేకుంటే సీవరేజ్ కనెక్షన్ కట్!

వాణిజ్య వ్యాపారస్తులకు జల మండలి హెచ్చరిక

సిటీబ్యూరో, నవంబరు 21(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వాణిజ్య వ్యాపారులకు జల మండలి జలక్ ఇచ్చింది. ఆసుపత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్ తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు సిల్ట్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ జల మండలి నోటీసులు జారీ చేయనుంది. అప్పటికీ నిర్లక్ష్యం వహించిన వారి సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లను తొలగించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. వాణిజ్య వ్యాపారాల నుంచి వచ్చే వ్యర్థాలు మ్యాన్‌హోళ్లలో కలవకుండా నియంత్రించడం, తద్వారా సీవరేజ్ పైపులైన్లపై ఒత్తిడి తగ్గి మురుగు ప్రవాహం సాఫీగా ఉంటుందని భావించి జల మండలి ఈ నిర్ణయం తీసుకుంది. అర్హులైన వినియోగదారులంతా సిల్ట్ ఛాంబర్లను నిర్మించుకోవాలని జల మండలి ఎండీ విజ్ఞప్తి చేశారు.

90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో..

జల మండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మెహిదీపట్నం, లంగర్ హౌజ్ ప్రాంతాల్లో డీ సిల్టింగ్ పనులను ఎండీ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. సీవరేజ్ ఔట్‌లెట్ లేని లైన్లను జల మండలి నూతనంగా నిర్మిస్తున్న జోన్-3 సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న ఈ ప్రాజెక్టులో 3 ప్రాంతాల్లో దాదాపు 2.1 కిలోమీటర్ల మేరకు స్థానిక సమస్యలతో పనులు నిలిచిపోయాయని, స్థానికులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు చేపడతామని చెప్పారు. మరో ఏడు కిలోమీటర్ల మేరకు పైపులైన్ నిర్మాణం పనులను ఫిబ్రవరి లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, జోన్-3 సీవర్ నెట్‌వర్క్ పనుల్లో భాగంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలో 33.50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి సంబంధించి రూ.297 కోట్ల వ్యయంతో 129.32 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నది. గోషా మహల్, నాంపల్లి, కార్వాన్‌తో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీవరేజి వ్యవస్థ ఆధునీకరణకు ఈ ప్రాజెక్టు చేపట్టిందని అధికారులు పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన స్వామి గౌడ్

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకురాలు లక్ష్మిరాజ్, నాయకులు సరికొండ దుర్గేశ్‌లు ఉన్నారు.

- బండ్లగూడ, నవంబర్ 21

ప్రభుత్వాల నుంచి దేవాలయాలకు విముక్తి కల్పించండి

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి

భారత్‌ను హిందూ రాష్ట్రంగా ప్రకటించాలి

గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, నవంబర్ 21: దేశంలోని దేవాలయాన్నింటిని ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక వైర్మన్ ఎల్వీ గంగాధర శాస్త్రి, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్ రావుతో కలిసి మాట్లాడారు. దేవాలయాన్ని ప్రభుత్వ పరిధిలోఉండటం వల్ల నిధులు, కైంకర్యాలు పక్కదారి పడుతున్నాయని, ఇతర పథకాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. చర్చిలు, మసీదులు ఆయా మతాలకు సంబంధించిన పెద్దలు నిర్వహిస్తున్నారని, హిందూ దేవాలయాలన్నింటినీ హిందూ సమాజానికే అప్పగించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం కల్తీ లాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా హిందూ దేవాలయాలను సైతం దేవాదాయ శాఖ నుంచి విముక్తి చేసి హిందూ సంఘాలకు బాధ్యతలు ఇవ్వాలన్నారు. టీటీడీ బోర్డులో సైతం సభ్యులుగా సాధువులు, సంతులు, పీఠాధిపతులను నియమించాలన్నారు. టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్తులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. హిందువులు, దేవాలయాల పరిరక్షణ కోసం సనాతన ధర్మ రక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని, దేవాలయాలపై జరుగుతున్న దాడులు, ప్రసాదాల అపవిత్ర కార్యక్రమాలను అడ్డుకోవాలన్నారు. ఇతర మతాలకు మంత్రిత్వ శాఖలు, బోర్డులను రద్దు చేయాలని, దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా భారత ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రపంచంలోని ఏకైక హిందు దేశమైన భారత్‌ను హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వెలగపూడి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేద భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ రెమెళ్ల అవధానులు, పలువురు అధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు

ఇన్‌కాయిస్‌కు సీఐఐ అవార్డు

దుండిగల్, నవంబర్ 21: నగర శివారు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సమీపంలోని 'భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం' (ఇన్‌కాయిస్)కు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) అవార్డు దక్కిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టెమ్ విమెన్ ఎక్సలెన్స్‌లోని టాప్-10 ఇనిస్టిట్యూషన్స్‌లో ఇన్‌కాయిస్ ఒకటిగా నిలిచి ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. పరిశ్రమల్లోని మహిళల సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ రంగాలలోని మహిళలను ప్రోత్సహించడంతో పాటు ఎప్పటికప్పుడు వారిని మెరుగుపరిచేందుకు ఈ అవార్డును ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 19న ఢిల్లీలో తమకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారులు ప్రొ. అజయ్ సూద్, నీతి ఆయోగ్ సభ్యులు డా. వీకే సారస్వత్‌లు అందజేసినట్టు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సుల పరీక్షా షెడ్యూల్ విడుదల

సిటీబ్యూరో, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ డిసెంబర్ 2024 వృత్తి విద్యా కోర్సుల పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఎన్ఐఓఎస్ ప్రాంతీయ సంచాలకులు పరమ్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. పరీక్షార్థులు ఎన్ఐఓఎస్ అధికారిక వెబ్‌సైట్ www.nios.ac.in నుంచి వివరమైన షెడ్యూల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, తమ పరీక్షా కేంద్రాలకు నిర్ణయించిన తేదీలు, సమయాలలో చేరుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఎన్ఐఓఎస్ అధికారిక హెల్ప్‌లైన్ (040 24752859, 2475 0712)లో సంప్రదించాలని పరమ్ ప్రీత్‌సింగ్ కోరారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

ఖైరతాబాద్, నవంబర్ 21: ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానం వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా హాజరైన శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉచిత చేప పి